
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
ఆదివారం 3 ఆగస్టు 2025

రుంజ దరువు.. ఆదరణ కరువు

అంతరించిపోతున్న ప్రాచీన వాయిద్యం

కళకు అంకితమైన ఏకైక కుటుంబం

తరతరాలుగా వాయిస్తుండడంతో వదులుకోలేక కొనసాగింపు

ప్రభుత్వం ప్రోత్సహించాలని వేడుకోలు

7

విశ్వంలో అతి ప్రాచీనమైన వాయిద్యంగా, భూమ్మీద ఆవిర్భవించిన మొదటి మంగళ వాయిద్యంగా పేరుపొందినది రుంజ. కానీ నేడు ఆదరణ కరువై మూగబోతున్నది. శుభకార్యాలు, వివాహాలు, ఆలయ ప్రతిష్ఠాపనలు, బోనాల వంటి ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే ఈ వాయిద్యం వినిపిస్తోంది. ఈ కళనే నమ్ముకుని జీవిస్తున్న కళాకారుల జీవితాలు దీనంగా మారాయి. ప్రభుత్వం ప్రోత్సహిస్తేనే మళ్లీ జీవం వస్తుందని వాయిద్యకారులు వేడుకుంటున్నారు.



మొక్కలు నాటి.. శ్రమదానం చేసి
జనహితం సక్సెస్



అందోలు నియోజకవర్గంలో ముగిసిన కాంగ్రెస్ నేతల పాదయాత్ర

రెండో రోజు విస్తృతంగా కార్యక్రమాలు

శ్రమదానం, కార్యకర్తల సమావేశం

స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్

ముఖ్య కార్యకర్తల సమావేశంలో దిశా నిర్దేశం



అందోలులో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్

జోగిపేట రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అందోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన రెండు రోజుల జనహిత పాదయాత్ర విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమం కాంగ్రెస్ శ్రేణులలో నూతనోత్సాహాన్ని నింపింది. ముగింపు సందర్భంగా శనివారం పట్టణంలో నిర్వహించిన పాదయాత్ర, ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమాలు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు భారీగా పాల్గొన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ జోగిపేటలో నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి శ్రమదానం చేసి మొక్కలు నాటారు. విద్యార్థులు ఉన్నత చదువులతో పాటు రాజకీయాల్లోకి కూడా రావాలని మీనాక్షీ నటరాజన్ పిలుపునిచ్చారు. యువత, ముఖ్యంగా మహిళలు రాజకీయాలపై ఆసక్తి చూపాలని సూచించారు. తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లిష్ భాషలపై కూడా పట్టు సాధించాలని ఆమె విద్యార్థులకు తెలిపారు. అనంతరం సంగుపేట సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. రెండో రోజు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో నాయకులు కార్యకర్తలకు ఇచ్చిన భరోసా వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

పథకాలపై అవగాహన కల్పించాలి

ముఖ్య కార్యకర్తల సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

మిగతా 7వ పేజీలో

ఆ'పరేషాన్' తీరింది

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు ఇక చింత వద్దు

మెదక్ జిల్లా ఆస్పత్రిలో మళ్లీ ప్రారంభం

మూడు నెలల్లో 160 ఆపరేషన్లు



మెదక్ కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక కారణాల వల్ల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న వారికి శుభవార్త. గతంలో హైదరాబాద్ శివారులో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు వికటించి పలువురు మహిళలు మృతిచెందిన ఘటన అనంతరం జిల్లాలోనూ ఆపరేషన్లను నిలిపివేశారు. ఇప్పుడు తిరిగి ప్రారంభించారు. మెదక్ జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిరంతరాయంగా జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

వైద్యులను సంప్రదించాలి

గతంలో ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు లేకపోవడం వల్ల ఆపరేషన్లు జరగలేదు. దీంతో పేద, మధ్యతరగతి మహిళలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వచ్చేది. ఒక్కో ఆపరేషన్‌కు రూ. 20వేల నుంచి రూ. 25వేల వరకు ఖర్చు చేయాల్సి రావడంతో ఆర్థికంగా చితికిపోయారు. కానీ మెదక్ జిల్లా ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రం డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గత మూడు నెలల్లోనే దాదాపు 160 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించామని మాతా శిశు ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సునీతా దేవి తెలిపారు. ఈ ఆపరేషన్లు ఇప్పుడు నిరంతరంగా కొనసాగుతాయని ఆమె చెప్పారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవాలని అనుకునేవారు ముందుగా వైద్యులను సంప్రదించి, పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం రక్త పరీక్షలు నిర్వహించి, అన్ని సరిగా ఉంటే ఆపరేషన్ చేస్తారని పేర్కొన్నారు.

డబ్బులు వృథా చేసుకోవద్దు



మెదక్‌లోని మాతా శిశు ఆరోగ్యకేంద్రంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను నిర్వహిస్తున్నాం. పేద, మధ్యతరగతి వారికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో నిరంతరాయంగా కొనసాగిస్తున్నాం. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోకుండా, ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ సేవలను వినియోగించుకోవాలి.

-సునీతా దేవి,
మెదక్ ఎంసీహెచ్ సూపరింటెండెంట్

ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు

అనుమతి లేని క్లినిక్ సీజ్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి కె.నాగనిర్మల ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. స్థానిక బైపాస్ రోడ్డులోని బృందావన్‌కాలనీలో అనుమతి లేకుండా నడుస్తున్న ఓ క్లినిక్, డయాగ్నోస్టిక్ సెంటర్‌ను సీజ్ చేసి రూ.10 వేల జరిమానా విధించారు. మరో ప్రైవేటు ఆస్పత్రిలో బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం పాటించలేదని నోటీసులు జారీ చేశారు. శస్త్రచికిత్సల రేట్లు ప్రదర్శించని ఆస్పత్రికి కూడా నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్య భద్రత దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఆస్పత్రుల తనిఖీలకు ఏడు బృందాలు ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలని పేర్కొన్నారు. ఆమె వెంట ఎంసీహెచ్ పీవో శశాంక్‌దేశ్‌పాండే, సిబ్బంది ఉన్నారు.

ఎస్‌ఏల ధ్రువపత్రాల పరిశీలన షురూ

జీహెచ్‌ఎం ఖాళీలు, ఎస్‌ఏ సీనియారిటీ జాబితా ప్రదర్శన.. నేడు అభ్యంతరాల స్వీకరణ


టీచర్ల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో భాగంగా సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయ ఆవరణలో స్కూల్ అసిస్టెంట్ల ధ్రువపత్రాలను శనివారం పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా పీఎస్ హెచ్‌ఎం, ఎస్‌ఏ తెలుగు, హిందీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ సబ్జెక్టు టీచర్లు తమ ధ్రువపత్రాల వెరిఫికేషన్ చేయించుకున్నారు. ఆదివారం మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, సోషల్, బయోసైన్స్ సబ్జెక్టు టీచర్ల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగనున్నది. పదోన్నతుల షెడ్యూల్ ప్రకారం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల ఖాళీలతో పాటు స్కూల్ అసిస్టెంట్ల ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాను విడుదల చేశారు. నేడు టీచర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు.

రెండో రోజు ముఖ హాజరు 86.44 శాతం

సాంకేతిక సమస్యలతో అడ్డంకులు.. పూర్తిస్థాయిలో అమలుకు మరో రెండు రోజులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ముఖ గుర్తింపు హాజరు నమోదుకు సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. సర్వర్ సమస్య.. సిగ్నల్ లేకపోవడంతో ముఖ గుర్తింపు హాజరులో అవాంతరాలు ఎదురవుతున్నాయి. పాఠశాల విద్యాశాఖ సర్కారు బడుల్లో టీచర్లకు ఈ నెల 1 నుంచి ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ (ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని అమలులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. సంబంధిత యాప్‌లో ఉపాధ్యాయులు రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో పలు సమస్యలు తలెత్తాయి. కొందరు యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటికీ ఫొటో నమోదు చేయడంలో సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో ఉదయం, సాయంత్రం రెండు పూటల హాజరు నమోదు చేయడానికి ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివిధ కారణాలతో కొందరు హాజరు నమోదు చేయలేకపోయారు. యాప్‌లో నమోదులో సాంకేతిక సమస్య మరో రెండు రోజుల్లో పరిష్కారమయ్యే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో తొలి రోజు (శుక్రవారం) 88.66 శాతం, శనివారం 86.44 శాతం ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు అయినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.


తూప్రాన్‌లో సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభిస్తున్న మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

'స్థానిక' ఎన్నికల కోసం
గ్రామానికో పోలీస్ : ఎస్పీ

తూప్రాన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక ఎన్నికల నేపథ్యంలో మెదక్ జిల్లాలో శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు ప్రతీ గ్రామానికి ఒక పోలీసును నియమించి సమాచారం సేకరిస్తున్నామని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు తెలిపారు. తూప్రాన్‌లోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. నేరాల నియంత్రణకు రాత్రి గస్తీలు, ప్రతీ సాయంత్రం వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించడానికి టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

సీసీ కెమెరాలు నేరాల నియంత్రణలో కీలకం

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, నేరాలు జరగకుండా నిరోధించడంలో, నేరాలు జరిగినప్పుడు నిందితులను త్వరగా గుర్తించడంలో ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలో సీసీ కెమెరాలు లేని గ్రామం ఉండకూడదని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ ప్రయత్నానికి ప్రజలు, దాతలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన పలువురికి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను తిరిగి అప్పగించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐలు రంగ కృష్ణ, వెంకటరాజాగౌడ్, జాన్‌రెడ్డి, ఎస్ఐలు శివానందం, సుభాష్‌గౌడ్, జ్యోతి పాల్గొన్నారు.

కళాశాలలో పార్కింగ్ దందా

పోటీ పరీక్షలకు, వివిధ కౌన్సెలింగ్‌లకు వచ్చే వారి నుంచి వసూళ్లు

- విద్యార్థుల తల్లిదండ్రుల జేబులకు చిల్లు
- మెయింటెనెన్స్ కోసం అంటూ రూ. లక్షల్లో వసూళ్లు



సంగారెడ్డి హనుమాన్‌నగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పేరుకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కానీ, అక్కడ జరుగుతున్న దందా చూసి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కళాశాలలో నిర్వహించే పోటీ పరీక్షలకు, వివిధ కోర్సుల కౌన్సెలింగ్‌లకు హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద పార్కింగ్ పేరుతో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఒక్కో వాహనం నుంచి రూ. 50 నుంచి రూ. 100 వరకు వసూలు చేస్తూ, రోజుకు వందల వాహనాల ద్వారా లక్షల్లో కూడబెడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

పేరెంట్స్ జేబులకు చిల్లు

పరీక్ష ఫీజులు, కౌన్సెలింగ్ ఖర్చులతో ఇప్పటికే ఆర్థికంగా భారంతో ఉన్న మధ్యతరగతి కుటుంబాలకు, ఈ పార్కింగ్ వసూళ్లు మరింత భారం మోపుతున్నాయి. కళాశాల పేరుతో రసీదులు ఇచ్చి మరీ ఈ వసూళ్లు చేస్తున్నారని, దీనివల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్ పేరుతో జరుగుతున్న ఈ వసూళ్లు తమను ఆర్థికంగా కుంగదీస్తున్నాయని వారు వాపోతున్నారు.

బాధ్యత ఎవరిది?

ప్రభుత్వ కళాశాలలో పార్కింగ్ వసూళ్లను అరికట్టే బాధ్యత ఎవరిదన్న ప్రశ్న తలెత్తుతోంది. సాధారణంగా పార్కింగ్ సమస్యలు తలెత్తితే విద్యాశాఖ లేదా ట్రాఫిక్ పోలీసు శాఖలు స్పందించాలి. కానీ, ఈ విధంగా డబ్బులు వసూలు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించడం సరికాదని తల్లిదండ్రులు అంటున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇలాంటి వసూళ్లు ఎక్కడా చూడలేదని, ఇక్కడే మొదటిసారి చూస్తున్నామని వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి కళాశాల అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మెయింటెనెన్స్ కోసమే..

-జానకీదేవి, కాలేజీ ప్రిన్సిపాల్

కళాశాల నిర్వహణ కోసమే వాహనాల పార్కింగ్‌కు డబ్బులు వసూలు చేశాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రావడం లేదు. వాహనాలు అడ్డదిడ్డంగా పెట్టడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులకు చెప్పినా స్పందించలేదు. అందువల్లే పార్కింగ్ ఏర్పాట్లు చేసి డబ్బులు వసూలు చేస్తున్నాం. అది కూడా కొన్ని రోజులు మాత్రమే వసూలు చేశాం.

కంపెనీల మాయాజాలం!

విచ్చలవిడిగా కాంప్లెక్స్ ఎరువుల ధరల పెంపు

పది రోజుల్లోనే బస్తాపై రూ.150 అధికం

కంపెనీల పేర్లు మారుస్తూ జిమ్మిక్కులు

రైతుల పాలిట గుదిబండలా ఎరువులు

7

వెల్‌నెస్ సెంటర్‌లో మందుల నిర్వహణలో లోపాలుండొద్దు

ఆరోగ్యశ్రీ ట్రస్టు అడిషనల్ డైరెక్టర్ సీహెచ్ ప్రభాకర్


వెల్‌నెస్ సెంటర్ ఫార్మసీని పరిశీలిస్తున్న అధికారులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వెల్‌నెస్ సెంటర్‌లో మందుల నిర్వహణలో లోపాలు ఉండొద్దని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు ప్లానింగ్ అండ్ కో ఆర్డినేట్ అడిషనల్ డైరెక్టర్ సీహెచ్ ప్రభాకర్ ఆదేశించారు. సంగారెడ్డిలోని వెల్‌నెస్ సెంటర్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్‌నెస్ సెంటర్‌లోని ఫార్మసీలో అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. మందుల కొరత రాకుండా ఎప్పటికప్పుడు స్టాక్ తెప్పించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆరోగ్యశ్రీ ట్రస్టు జిల్లా మేనేజర్ జిల్లా మేనేజర్ విజయభాస్కర్, టీం లీడర్ ప్రవీణ్‌కుమార్, సెంటర్ ఇన్‌చార్జి డా. నయోమీ ఉన్నారు.

గోవా మద్యం పట్టివేత

మునిపల్లి /పటాన్‌చెరు ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): గోవా నుంచి హైదరాబాద్ తరలిస్తున్న మద్యాన్ని శనివారం మునిపల్లి పోలీసులు పట్టున్నారు. మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద వాహనాలను ఆపి తనిఖీ చేయగా 5.250 లీటర్ల గోవా మద్యం లభించింది. పటాన్‌చెరులో పోలీసులు కిలో ఎండు గంజాయి పట్టుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.

అంగన్‌వాడీల్లో ఆట పాటలు

రామయంపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రాథమిక విద్య, అంగన్‌వాడీల బలోపేతం దిశగా కృషి జరుగుతోందని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. రామాయంపేట మండల పరిధి దంతేపల్లి, కిషన్ తండా గ్రామపంచాయతీల్లో శనివారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. మొదట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాటామంతి కలిపారు. పాఠాలు బోధించారు. పుస్తకాలు చదివిస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు ఆట పాటలు నేర్పాలని ఈ సందర్భంగా నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. పిదప డ్రైడే డ్రైడే సందర్భంగా పలు వీధుల్లో తిరిగి నీటి కుళాయిలు, పాడుబడ్డ పశువుల తొట్లు చూశారు. ఎప్పటికప్పుడు పరిసరాల పరిశుభ్రత పై జాగ్రత్తలు పాటించాలని సంబంధిత కార్యదర్శులను కలెక్టర్ ఆదేశించారు. కిషన్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.



దంతేపల్లిలో అంగన్‌వాడీ పిల్లలతో చదివిస్తున్న మెదక్ కలెక్టర్

కాంగ్రెస్.. బీఆర్ఎస్ బాహాబాహీ

హత్నూర, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): హత్నూరలో కల్యాణలక్ష్మి చెక్కులు, రేషన్ కార్డుల పంపిణీ రసాభాసగా మారింది. మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతుండగా.. కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసేందుకు ప్రయత్నించారు. బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోవడంతో ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు నినాదాలు, ప్రతినినాదాలు చేస్తూ తోసుకున్నారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని కొందరు చించేశారు. పోలీసులు నచ్చజెప్పినా, వినకపోవడంతో ఇరు పార్టీల నాయకులను బయటకు నెట్టివేశారు. అనంతరం ఈ ఘటనపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చిత్రపటాన్ని కాంగ్రెస్ నాయకులే చించేసి తమపై బురద జల్లుతున్నారని ఆరోపించారు. సీఎం చిత్రపటాన్ని చించేసిన బీఆర్ఎస్ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు.



బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల తోపులాట

విగ్రహ దొంగల అరెస్టు

మెదక్ అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వినాయకుడి విగ్రహాన్ని దొంగలించిన నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. శనివారం పట్టణస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. గత నెల 27న మెదక్‌లోని చంద్రభవన్ కాంప్లెక్స్ నుంచి వాహనంలో వినాయకుడి విగ్రహాన్ని దొంగలించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. ఈ ఘటన విగ్రహ తయారుదారుడు సురేష్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. హైదరాబాద్‌లోని మీర్‌పేటకు చెందిన కృష్ణకుమార్ మెదక్‌లోని అత్తగారి ఇంటికి తరుచూ వస్తుంటాడు. ఈక్రమంలో కృష్ణకుమార్ తన స్నేహితులైన హయత్ నగర్‌కు చెందిన నాగరాజు, తరుణ్, మహేష్, రాముతో కలిసి అద్దెకు ఆటో మాట్లాడుకుని కాంప్లెక్స్‌లో విక్రయానికి బయట ఉంచిన వినాయకుడి విగ్రహాన్ని దొంగలించారు. నిందితులను పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తలించారు. ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నాడు. నలుగురి నిందితులపై దొంగతనం, గంజాయి కేసులు ఉన్నాయి. మత్తు పదార్థాలకు బానిసై ఈజీ మనీ కోసం దొంగతనాలకు పాల్పుడుతున్నారని అదనపు ఎస్పీ వెల్లడించారు.

రెండు దుకాణాలల్లో చోరీ

దుబ్బాక, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక పట్టణంలోని రెండు దుకాణాలల్లో శనివారం తెల్లవారుజామున చోరీకి పాల్పడి, 10 మొబైల్స్‌తో పాటు, 15వేల నగదును దొంగలించారు. పట్టణంలోని అంగడిబజారులో గల దుకాణ సముదాయంలోని ఎండీ గౌస్ మొబైల్ దుకాణం, ఉదయ్ కళ్యాణ్ పెయింటింగ్ దుకాణంలో తాళం పగలకొట్టి, దొంగతనానికి పాల్పడినట్లు దుబ్బాక ఎస్సై కీర్తిరాజు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గీతన్నల సామాజిక చైతన్య యాత్ర

కొండాపూర్, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత సొసైటీలకు, కార్మికులకు ఈత చెట్ల పెంపకానికి భూములను కేటాయించాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం గొల్లపల్లిలో విప్లవ వీరులు సర్వాయిపాపన్న, ఐలమ్మ, జ్యోతిరావుపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, అమరవీరుల యాధిలో గీతన్నల సామాజిక యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు అశన్నగౌడ్, రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈత, తాటి వనాల పెంపకాల సంఘాలకు ఐదు ఎకరాల భూమి, సబ్సిడీ రాయితీలో బోరుబావులు, డ్రిప్ మంజూరు చేయించి, జీవో 560 ప్రకారం గీత కార్మికులను ఆదుకోవాలన్నారు. వృత్తి నివారణకు సేఫ్టీ కిట్లు, పెండిగ్ ఎక్స్‌గ్రేషియా వేంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కల్లుగీత కార్మికుల హక్కులకు కాపాడి అమరులైన విప్లవ కారులను గుర్తుచేసుకుంటూ ఈ చైత్యన్య యాత్రను జిల్లా వ్యాప్తంగా పర్యటించి ఈ నెల 18న సర్వాయి పాపన్న జయంతిన ముగుస్తుందన్నారు.

అనుమానాస్పదస్థితిలో చిన్నారి మృతి

దుబ్బాక, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): దుబ్బాక పట్టణంలో శనివారం చిన్నారి బాలిక (04) అనుమానస్పదస్థితిలో మృతి చెందింది. ఆ చిన్నారిని స్కూల్ యూనిఫాం కోసం స్కూల్‌నుంచి తీసుకుని వచ్చిన తండ్రి, పాపకు అన్నం తినపెట్టి, పడుకోబెటాడు. ఐతే నిద్రలోనుంచి ఒక్కసారిగా పాప లేవడంతో ఆమెను స్థానిక ఆసుపత్రికి తీసుకుని వెళాడు. అప్పటికే చిన్నారి మృతి చెందింది. దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారి మరణం అనుమానస్పదంగా భావించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కీర్తిరాజు తెలిపారు. చిన్నారి మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టానికి తరలించారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

జహీరాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని విట్టునాయక్‌తండాలో జరిగింది. చిరాగ్‌పల్లి ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విట్టునాయక్‌తండాకు చెందిన సునీల్, కర్ణాటకలోని పాల్యాతండాకు చెందిన ఆశ అలియాస్ సోని(19) ఆర్నెళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. సునీల్ ఆటోడ్రైవర్. కాగా, శుక్రవారం సోని పొలం పనికని వెళ్లి తిరిగిరాలేదు. దీంతో రాత్రి కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి వెతకగా చెట్టుకు ఊరేసుకుని కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సోని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

పంచాయతీ కార్యదర్శి బైక్ దహనం

నంగునూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న పంచాయతీ కార్యదర్శి ద్విచక్ర వాహనాన్ని శనివారం గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారు. రాజగోపాలపేట ఎస్సై వివేక్ తెలిపారు. నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామపంచాయతీలో పంచాయతీ సెక్రెటరీగా పనిచేస్తున్న ఎండీ గౌసోద్దీన్ విధి నిర్వహణలో భాగంగా తన ద్విచక్ర వాహనం ఏపీ 23 ఆర్ 1196 ను గ్రామంలోని వైకుంఠధామం వద్ద ఏర్పాటుచేసిన నర్సరీ ముందు పార్క్ చేసి పనులు చేయించేందుకు వెళ్లాడు. నర్సరీలో జరుగుతున్న పనులను పరిశీలించి వచ్చేసరికి ద్విచక్ర వాహనంపై పెట్రోల్ పోసి గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రుంజ దరువు.. ఆదరణ కరువు



- అంతరించిపోతున్న ప్రాచీన వాయిద్యం
- ఇప్పటికీ ఈ కళకు జీవం పోస్తున్న ఏకైక కుటుంబం
- తరతరాలుగా వస్తున్న కళను వదులుకోలేక కొనసాగింపు
- ప్రభుత్వం ప్రోత్సహించాలని వేడుకోలు

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన వాయిద్యాల్లో ఒకటిగా రుంజను పరిగణిస్తారు. ఏ ఇతర వాయిద్యాలు లేని కాలంలో పుట్టిన ఈ రుంజకు సరైన ఆదరణ లేకపోవడం వల్ల అంతరించిపోయే దశకు చేరుకుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో కేవలం మెదక్ జిల్లా, చిన్నశంకరంపేట మండలం, రుద్రారం గ్రామంలో ఒకే కుటుంబం ఈ కళను కొనసాగిస్తోంది. తరతరాలుగా వచ్చిన ఈ కళను వదులుకోలేక, ఇతర పనులకు వెళ్లలేక ఈ కళాకారులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

రుంజకాసురుడి నుంచే రుంజ వాయిద్యం

రుంజ వాయిద్యం పుట్టుక వెనుక ఒక ఆసక్తికరమైన కథనం ఉంది. పెళ్లిళ్లకు వాయిద్యాలు లేకపోవడంతో, శివపార్వతుల వివాహానికి ఒక వాయిద్యం ఉండాలని దేవతలు విశ్వకర్మను కోరారు. అప్పుడు విశ్వకర్మ, లోకంలో అరాచకాలు సృష్టిస్తున్న రుంజకాసురుడు అనే రాక్షసుడిని సంహరించి, అతని కళేబరంతో రుంజ వాయిద్యాన్ని తయారు చేస్తానని చెప్పాడు. 32 ఆయుధాల వల్ల చావు లేకపోవడం , ఒక రక్తపు చుక్క భూమి మీద పడితే వెయ్యిమంది రాక్షసులు పుట్టడం, చనిపోతే ఏడు క్షణాల్లో మళ్లీ బతికే వరాలు రుంజకాసురుడికి ఉన్నాయి. దీని వల్ల అతను దేవతలను హింసించేవాడు. రుంజకాసురుడిని అంతం చేయడానికి, విశ్వకర్మ 33వ ఆయుధమైన చక్రాయుధాన్ని తయారు చేసి, అతనిని సంహరించాడు. ఆ రాక్షసుడి కళేబరంతోనే రుంజ వాయిద్యాన్ని తయారు చేశారని పురాణాలు చెబుతున్నాయి.



మనిషి అవయవాలే రుంజకు..

మనిషి శరీరంలోని అన్ని అవయవాలు రుంజ వాయిద్యంలో ఉంటాయని నమ్మకం. రుంజకాసురుడి కోరలు నాగవాసాలుగా, ప్రేగులు పగ్గాలుగా, నరాలు బొదెల్లుగా, వేళ్లు పుల్లలుగా, చర్మం మోతగా మారాయి. అందుకే ఈ వాయిద్యానికి రుంజ అని పేరు వచ్చిందని చెబుతారు.

ప్రభుత్వ ప్రోత్సాహం కోసం ఎదురుచూపులు

ఈ అతి ప్రాచీనమైన కళ నాకు మా తాత, తండ్రి యాదగిరిల ద్వారా వంశపారంపర్యంగా వచ్చింది. నాన్న చనిపోయిన తర్వాత కుటుంబాన్ని పోషించడానికి రుంజ వాయిద్యమే ఆధారం అయింది. ఇప్పటివరకు ఏ ప్రభుత్వమూ మా కళను ఆదరించలేదు. ఈ కళ అంతరించిపోకుండా ఉండాలంటే, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం చాలా అవసరం. రుంజ వాయిద్యం నేర్చుకోవడానికి కనీసం పదేళ్లు పడుతుంది. ఇన్ని సంవత్సరాలు కష్టపడి నేర్చుకున్నా ఆదరణ లేకపోతే, కళాకారుల జీవితాలు వృథా అవుతాయి. ప్రభుత్వం ఈ కళను గుర్తించి, ప్రోత్సాహకాలు అందిస్తే, ఆసక్తి ఉన్న యువతకు ఈ వాయిద్యాన్ని నేర్పించి, ఈ ప్రాచీన కళను బతికించవచ్చు.

- కల్లేపల్లి అమర్‌నాథ్, రుంజ కళాకారుడు, రుద్రారం



సైనికుడు ఖలీల్ పాషను సన్మానిస్తున్న మల్కాపూర్ నాయకులు

సైనికుడికి ఘన సన్మానం

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): దేశ సేవలో 20 సంవత్సరాలు పూర్తి చేసుకుని తిరిగివచ్చిన వీరసైనికుడు ఖలీల్ పాషాను మల్కాపూర్ గ్రామస్థులు, నాయకులు ఘనంగా సన్మానించారు. కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఖలీల్ పాషాకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పారామిలటరి రిటైర్డ్ అధికారి సంగమేశ్వర్, మల్కాపూర్ ప్రజాప్రతినిధి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్ మెడలిస్టులకు ఎస్పీ అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహించిన ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ 2025లో సంగారెడ్డికి చెందిన విద్యార్థినులు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా శనివారం సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థినులను అభినందించి, సన్మానించారు. గడ్డం శృతి (70 కేజీ సీనియర్ విభాగం), గడ్డం స్వాతి (56 కేజీల జూనియర్ విభాగం) అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని గ్రాండ్ మాస్టర్ ఎండీ సాజిద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూన వేణుగోపాలకృష్ణ, మాస్టర్లు శ్రీను, అశోక్, అజీజ్, ఏజాజ్, శిరీష, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

కేన్సర్ రహిత దేశంగా భారత్

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కేన్సర్ రహిత దేశంగా భారత్‌ను తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక గాంధీ నగర్‌లో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..మెదక్‌లో కేన్సర్ ఆసుపత్రిని నిర్మించేందుకు వెయ్యి గజాల స్థలాన్ని ఇచ్చేందుకు దాత ముందుకు వచ్చారన్నారు. కేంద్ర సర్కార్ రానున్న రోజుల్లో ప్రతి జిల్లాకు ఒక ఆసుపత్రి ఏర్పాటు చేయనుందన్నారు. ఆయన వెంటనే బీజేపీ జిల్లా అధ్యక్షులు మల్లేశం గౌడ్, మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు, తదితరులు ఉన్నారు.

'ఆరోగ్య శిబిరాలపై నిర్లక్ష్యం వద్దు'



వైద్య సేవలపై ఆరా తీస్తున్న జిల్లా వైద్యాధికారి

రామాయంపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఉచిత ఆరోగ్య శిబిరాల నిర్వహణపై నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ సూచించారు. శనివారం ఆయన రామాయంపేట మండల పరిధిలోని ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి, సిబ్బంది హాజరు పట్టిక, మందుల నిల్వలను పరిశీలించారు. మండల వైద్యాధికారిని హరిప్రియ సిబ్బంది ఉన్నారు.

అక్రమ ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కోహెడ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను కోహెడ ఎస్సై అభిలాష్ పట్టుకున్నారు. ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. 35 ట్రాక్టర్ల ఇసుక డంపులకు ఈనెల 5న బహిరంగ వేలం ఉంటుందని తహసీల్దార్ సమీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.10 వేలు చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

గుడి పేరుతో రాజకీయాలు చేయొద్దు

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మెదక్‌లోని కోదండ రామాలయాన్ని దేవాదాయశాఖ అధికారులు స్వాధీనం చేసుకునేందుకు వచ్చి, హుండీ, ధర్మశాలలకు తాళం వేయడాన్ని ఆలయ పరిరక్షణ కమిటీ, హిందూ సంఘాలు, అఖిలపక్ష నాయకులు తీవ్రంగా ఖండించారు. సమాచారం అందుకున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు శనివారం రామాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడి పేరుతో రాజకీయాలు చేయవద్దన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం యూపీఏ నేతలను పాకిస్తాన్ ఏజెంట్లుగా మార్చి హిందువులను టెర్రరిస్టులుగా చూపించిందన్నారు. ఈ సమస్యపై దేవాదాయశాఖ కమిషనర్, రాష్ట్ర మంత్రి ఫోన్‌లో అందుబాటులోకి రాలేదని ఆయన ఆరోపించారు. రామాలయాన్ని ఎండోమెంట్‌లో కలపొద్దని డిమాండ్ చేస్తూ ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు మల్లేశం గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, సీనియర్ నాయకులు, ఎంఎల్ఎన్ రెడ్డి, సుభాష్‌గౌడ్, లోకేష్, సత్యనారాయణ, శంకర్, సురేష్, మధు, నాగరాజు, ప్రసాద్, సతీష్, శివ, వీణ, సంగీత, ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యులు, తదితరలు పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ శ్రేణుల రాస్తారోకో

మెదక్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా కేంద్రంలోని రామాలయాన్ని దేవాదాయ శాఖలో విలీనం చేయవద్దని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బీఆర్ఎస్ నాయకులు రామాలయం ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఆలయాన్ని తిరిగి ప్రజలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లిఖార్జున్‌గౌడ్, నాయకులు అంజనేయులు, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, జయరాజ్, జీవన్‌రావు, మల్లేశం, విజయలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రియురాలితో అసభ్యంగా ప్రవర్తించాడని హత్య

- అప్పటికే ఆమెకు వివాహం.. ఓ పాప
- తనతోనూ సంబంధం పెట్టుకోవాలని వేధింపులు
- విషయం తెలిసి పథకం ప్రకారం హత్య

ములుగు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తనతో వివాహేతర సంబంధం ఉన్న మహిళతో అసభ్యంగా ప్రవర్తించడం, వివాహేతర సంబంధం పెట్టుకోవాలని ఒత్తిడి చేయడం, చిట్టీల లావాదేవీల్లో గొడవలు వెరసి ఓ ఐకేపీ కంప్యూటర్ ఆపరేటర్‌ను దారుణంగా హత్య చేశారు. గత నెల 28న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు గజ్వేల్ సీఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్సై విజయ్‌కుమార్‌లు శనివారం వివరాలు వెల్లడించారు. ములుగు మండల కేంద్రానికి చెందిన తీగుళ్ల నెహ్రూ (35) ములుగు ఐకేపీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. నెహ్రూకు వర్గల్ మండలం మజీద్‌పల్లి గ్రామానికి చెందిన గామిలిపురం మహేశ్‌తో కొన్నేళ్లుగా స్నేహం ఉంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే మహేశ్‌తో నెహ్రూ రియల్ ఎస్టేట్, ప్రైవేటు చిట్టీలు నిర్వహిస్తున్నారు. మహేశ్‌కు ఓ వివాహితతో వివాహేతర సంబంధం ఉంది. ఆమెకు వివాహం అయి ఓ పాప కూడా ఉంది. ఈ విషయం నెహ్రూకు తెలుసు. దీంతో సదరు మహిళపై కన్నేసిన నెహ్రూ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయం ఆమె మహేశ్‌కు చెప్పింది. అదే క్రమంలో వ్యాపార విషయంలోనూ ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. తన ప్రియురాలితో అసభ్యంగా ప్రవర్తించడంతో కోపం పెంచుకున్న మహేష్.. నెహ్రూను చంపాలని పథకం వేశాడు. గత నెల 28న నగల విషయం మాట్లాడేందుకు రావాలంటు నెహ్రూను తీసుకుని.. మేడ్చల్ సమీపంలో ఉండే మహిళ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య సదరు మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన విషయం చర్చకు రావడంతో నెహ్రూపై మహేశ్ దాడి చేశాడు. అపస్మారకస్థితిలోకి వెళ్లిన నెహ్రూ గొంతును వైరుతో నులిమి హత్య చేశాడు. మహిళ, ఆమె తండ్రి సహాయంతో మృతదేహాన్ని మద్దూరు మండలం గాగిళ్లపూర్‌కు కారులో తీసుకువచ్చారు. మృతదేహానికి రాళ్లు కట్టి, అక్కడి చెరువులో పడేశారు. తర్వాత మహేష్ తన స్నేహితుడు ఉబ్బని వినయ్ సహాయంతో నెహ్రూ మొబైల్ నుంచే నెహ్రూ భార్యకు ఫోన్ చేసి.. 'నెహ్రూ ఈ రోజు రాడు.. రేపు వస్తాడు' అని చెప్పించాడు. మార్గమధ్యంలో మొబైల్ ఫోన్‌ను కొండపోచమ్మ సాగర్ కెనాల్‌లో పడవేశారు. నమ్మించేందుకు నెహ్రూ ఇంటికి వెళ్లి మహేశ్ రూ. 15వేలు నెహ్రూ భార్యకు ఇచ్చాడు. అయితే, భర్త ఇంటికి రాకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త మహేష్‌తో కలిసి వెళ్లాడని వారికి వివరించింది. దీంతో మహేష్‌ను అదుపులోకి తీసుకోగా, జరిగిన విషయం బయటకు వచ్చింది. అతడు చెప్పిన మేరకు గత నెల 30న గాగిళ్లపూర్ చెరువు నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ సంఘటనలో మహేశ్‌ను అతనితో వివాహేతర సంబంధం ఉన్న మహిళను, ఆమె తండ్రిని, మహేశ్ స్నేహితుడు వినయ్‌లను అరెస్టు చేసి, రెండు కార్లు, నాలుగు మొబైల్ ఫోన్లు, ఒక టీవీఎస్ ఎక్సల్ వాహనాన్ని సీజ్ చేసినట్లు వివరించారు.

జాబ్ కేలండర్‌కు ప్రథమ వర్ధంతి

● పిండ ప్రదానాలు చేయాలని బీఆర్ఎస్వీ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ కేలండర్‌కు ఆగస్టు 2తో ప్రథమ వర్ధంతి పూర్తయిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మెరుగు మహేష్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ నిరుద్యోగులను వంచించిందన్నారు నిరుద్యోగులు ప్రశ్నిస్తే నామమాత్రంగా జాబ్ కేలండర్‌ను విడుదల చేశారన్నారు. ఏడాదిలో ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. క్యాలెండర్ విడుదలై ఏడాది పూర్తయిన నేపథ్యంలో సీఎం రేవంత్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, కోదండరాం, చిత్రపటాలకు పిండప్రదానం చేసి నిరసనలు తెలుపాలని పిలుపునిచ్చారు. పార్టీ చిన్నకోడూరు మండల అధ్యక్షుడు గుజ్జరాజు, నాయకులు నరేష్, కమల్ యాదవ్, నాయకులు భానుచందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి.. శ్రమదానం చేసి జనహితం సక్సెస్

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తున్నదని చెప్పారు. ఈ పథకాల గురించి కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు వివరించాలని కోరారు.

స్థానిక ఎన్నికల్లో వంద శాతం విజయం లక్ష్యం

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు వంద శాతం విజయం సాధించేలా కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే ఎస్సీ వర్గీకరణ సాధించామని, దాని ఫలాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి ఆర్థిక సంక్షోభం సృష్టించారని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడె సంగమేశ్వర్, మాజీ మంత్రి చంద్రశేఖర్, నాయకులు కాటా శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌గౌడ్, త్రిషా దామోదర్, గిరిదర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి, ఆవుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి సైబర్ వల

రాయపోల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాలో రీల్స్ చేస్తూ ఓ డ్రోన్ కెమెరా కోసం ఫోన్ చేయగా, సైబర్ నేరగాళ్లు మాయమాటలు చెప్పి బాలుడి నుంచి రూ. రెండున్నర లక్షలు కొట్టేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం సయ్యద్ నగర్‌కు చెందిన అలీబీబీ కూలి పనులు, ఆమె భర్త దుబాయ్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. వారికి ఎనిమిదో తరగతి చదివే కొడుకు అజ్మొద్దీన్ ఉన్నాడు. దుబాయ్‌లో ఉన్న అలీ హుస్సేన్ అక్కడ సంపాదించిన డబ్బులను భార్య పేరిట ఉన్న బ్యాంకు ఖాతాకు పంపించేవాడు. ఈ బ్యాంక్ ఖాతాలకు లింక్ అయి ఉన్న ఫోన్‌ను అజ్మొద్దీన్ కూడా వినియోగిస్తాడు. ఆ ఫోన్ నుంచే పేయాప్‌లతో డబ్బులను వివిధ అవసరాలకు వాడేవారు. దీంతో బ్యాంక్ పాస్‌వర్డ్‌లన్నీ బాలుడికి తెలుసు. నాలుగు రోజుల క్రితం అజ్మొద్దీన్ ఇన్‌స్టాలో వీడియోలు చూస్తుండగా, డ్రోన్ కెమెరా అమ్మబడును అని కనిపించింది. కింద కనిపించిన ఫోన్ నంబర్‌కు కాల్ చేయగా, డబ్బులు పంపిస్తే కెమెరా పంపిస్తామని అవతలి వ్యక్తి చెప్పాడు. దీంతో అజ్మొద్దీన్ తల్లిదండ్రులకు తెలియకుండా మొదటగా రూ. 50 వేలు పంపించాడు. రెండు రోజుల పాటు మాయమాటలు చెప్పిన సైబర్ నేరస్థులు పలుమార్లు ఫోన్‌పే ద్వారా రూ. రెండున్నర లక్షలు తమ ఖాతాలకు మళ్లించుకున్నారు. ఆ తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. విషయం తల్లిదండ్రులకు తెలిస్తే ఏమవుతుందో అని భయపడ్డ బాలుడు జ్వరం బారిన పడ్డాడు. తల్లి ఆస్పత్రికి తీసుకెళ్లింది. బిల్లు చెల్లించేందుకు తల్లి ప్రయత్నించగా, ఖాతా ఖాళీ అయి ఉంది. కంగారు పడి అజ్మొద్దీన్‌ను ప్రశ్నించగా, జరిగిన విషయం చెప్పాడు. ఈ మేరకు బాధితులు శనివారం రాయపోల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కంపెనీల మాయాజాలం!

విచ్చలవిడిగా కాంప్లెక్స్ ఎరువుల ధరల పెంపు

- పది రోజుల్లోనే బస్తాపై రూ.150 అధికంగా వసూలు చేస్తున్న వైనం
- కంపెనీల పేర్లు మారుస్తూ జిమ్మిక్కులు
- రైతుల పాలిట గుదిబండలా ఎరువులు
- చేతులెత్తేసిన అధికారులు

కంది, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాకు బహుళ పోషకాలున్న ఎన్‌పీకే (నత్రజని, బాస్వరం, పోటాషియం) కాంప్లెక్స్ ఎరువులు సరఫరా చేసే కంపెనీల డీలర్లు జిమ్మిక్కుల మీద జిమ్మిక్కులు చేస్తున్నారు. పూటకో కంపెనీ పేరు మారుస్తూ ఎరువులను పీఏసీఎస్‌లకు ఫర్టిలైజర్ షాపులకు సరఫరా చేస్తున్నారు. అంతేగాక ప్రతి 50 కేజీల బస్తాకు రూ.50, రూ.100 చొప్పున పెంచుతూ దండుకుంటున్నారు. కొన్ని నెలలుగా గ్రోమోర్ కంపెనీ చెందిన 20-20 ఎరువులను 50 కేజీల బస్తా 1300లకు విక్రయిస్తే, పది రోజుల క్రితం(జూలై 23)న చంబల్ కంపెనీ పేరుతో దిగుమతి చేసుకున్న 20-20 ఎరువులు ఏకంగా బస్తాకు రూ.100 చొప్పున పెంచేశారు. ఇక శనివారం నర్మదా కంపెనీకి చెందిన 20-20 దిగుమతి చేసుకోగా, బస్తాకు మరో రూ.50 అదనంగా అంటే రూ.1450 ఎమ్మార్పీతో ఉన్నది. ఇక నుంచి బస్తాకు మరో రూ.50 పెంచి అమ్మాలని సూచిస్తున్నారు. పది రోజలు వ్యవధిలోనే రూ.1300 ఉన్న కాంప్లెక్స్ ఎరువులు ఒక్కసారిగా బస్తాకు రూ150 పెరిగి ఇప్పుడు రూ1450 చేరింది. ఇదేమీ అర్థం కాని అన్నదాతలు పది రోజుల వ్యవధిలో ఒక బస్తాకు రూ. 150 పెరగడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక అప్పులు చేసి మరీ అధికధరలకు ఎరువులను కొంటున్నారు. ఈ విషయమై శనివారం జిల్లా వ్యవసాయ అధికారులను వివరణ కోరితే రేటు విషయంలో తుది నిర్ణయం కంపెనీలదేనని, అది కూడా కేంద్రం చేతుల్లో ఉంటుందని తెలిపారు.



పాత రేటును అంగీకరించని పీఓఎస్

కంది పీఏసీఎస్‌లో పీఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) మిషన్‌లో ఎరువుల కొనుగోలు చేసే రైతుల ఆధార్ కార్డు నెంబరు, ధర ప్రభుత్వమే నిర్ణయించి ఆన్‌లైన్ ద్వారా సూచిస్తుంది. శనివారం పీఏసీఎస్ సిబ్బంది 20-20 కాంప్లెక్స్ ఎరువుల ధరను రూ.1400 బస్తా చొప్పున నమోదు చేస్తే అది నమోదు చేసుకోలేదు. రూ.1450 లెక్కన నమోదు చేస్తేనే సక్సెస్ అయ్యి నమోదు అవుతుండడం గమనార్హం. దీంతో పీఏసీఎస్ నిర్వహకులు బస్తాకు రూ.50 రూపాయలు అదనంగా భరించి రూ.1400లకు 20-20 విక్రయించారు. వ్యవసాయ అధికారులు మాత్రం ఎమ్మార్పీ ధరకే ఎరువులను విక్రయియించాలని సూచిస్తున్నారు.

1800 మెట్రిక్ టన్నుల ఎరువులు ..

కంది మండలంలో మొత్తం 19 వేల ఎకరాల్లో ఆయా పంటలు సాగవుతుండగా, 1800 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అధికారులు తెలిపారు. కంది మండలంలోని పీఏసీఎస్, కాశీపూర్‌లోని రెండు ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులు, బేగంపేటలో ఒక ఫర్టిలైజర్ షాప్ ద్వారా మొత్తం 800 మెట్రిక్ టన్నుల యూరియా, 150 మెట్రిక్ టన్నుల డీఏపీ, 350 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను మాత్రమే అమ్ముతున్నారు. మిగతా ఎరువులను హైదరాబాద్, సంగారెడ్డి టౌన్, పటాన్‌చెరు, శంకర్‌పల్లి, సదాశివపేటల నుంచి రైతులు తెచ్చుకుంటున్నట్లు సమాచారం.

అప్పుల పాలవుతున్నాం..



పంటల దిగుబడికి కాంప్లెక్స్ ఎరువులు ఎంతో అవసరం. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కంపెనీల యజమానులు ఇష్టారాజ్యంగా రేట్లు పెంచి దోచుకుంటున్నారు. తప్పని పరిస్థితుల్లో కొనుగోలు చేసి అప్పులపాలవుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపించి కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించాలి.

-బండి వీరారెడ్డి, రైతు, కంది

వారానికోసారి పెంచుతున్నారు..



పాత ధరలకు దొరికే గ్రోమోర్ కంపెనీ 20-20 ఎందుకు సరఫరా కావడం లేదు. కొత్త కంపెనీల పేరుతో వారానికోసారి రేట్లు పెంచుతున్నారు. పది రోజుల వ్యవధిలో బస్తాకు రూ.150 పెంచడం సరికాదు. అధికారులు రేట్లు అదుపులోకి తెచ్చి రైతులకు అండగా నిలువాలి.

-బానోత్ కుమార్, గొల్లగూడతండా

ధర నిర్ణయం మా చేతుల్లో లేదు

కాంప్లెక్స్ ఎరువుల రేట్లు పెంపకం కేంద్రం చేతిలోనే ఉంటుంది. కొన్ని కంపెనీలకు అవసరానికి అనుగుణంగా ధరలు పెంచుకునేలా 8 ఏళ్ల క్రితమే కేంద్రం అవకాశమిచ్చింది. బహుళ జాతి పోషకాలున్న కాంప్లెక్స్ ఎరువుల్లో వాడే ముడి సరుకులు, మార్కెట్లో దొరికే రేట్లను బట్టి ఒక్కో కంపెనీ ఒక్కో ధరకు ఎరువులను విక్రయిస్తుంది.

-శివప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి

న్యూస్ బాక్స్

సబ్ కలెక్టర్‌ను కలిసిన అధికారులు

నారాయణఖేడ్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ సబ్ కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఉమాహారతిని శనివారం వివిధ శాఖల అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. సీడీపీవో సుజాత, సహాయ సాంఘీక సంక్షేమాధికారి శ్రీనివాస్, మండల విద్యాధికారులు విశ్వనాథ్, శ్రీనివాస్, రాజశేఖర్, మన్మథకిషోర్, శ్రీనివాసరావు, రాములు బొకేలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

శివాలయ నిర్మాణానికి భిక్షాటన

జిన్నారం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిన్నారంలో జ్యోతిర్లింగ శివాలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలనే సంకల్పంతో భక్తులు, నిర్మాణ కమిటీ సభ్యులు భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయని, త్వరలోనే శివలింగం ఏర్పాటు చేపడుతామని, ఇందుకోసం భక్తుల నుంచి భిక్షాటన రూపంలో విరాళాలు సేకరించినట్లు సభ్యులు తెలిపారు.

మెడికల్ కాలేజీలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ, అనుబంధ జనరల్ ఆస్పత్రిలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసేందుకు అర్హత కలిగిన అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, సీనియర్ రెసిడెంట్లు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.ప్రకాశ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతర వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. దరఖాస్తు ఫారాన్ని కళాశాల వెబ్‌సైట్ నుంచి పొందాలన్నారు.

గ్రూప్స్, బ్యాంకింగ్ పరీక్షలకు ఉచిత శిక్షణ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1, 2, 3,4తో పాటు ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ ఫౌండేషన్ పరీక్షలకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులైన సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు 11వ తేదీలోగా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి ఈ నెల 25 నుంచి 150 రోజుల పాటు శిక్షణతో పాటు నెలకు రూ.1000 చొప్పున స్టైపండ్ ఇస్తామని తెలిపారు. వివరాలకు 08455-277015 నంబరు సంప్రదించాలని ఆయన కోరారు.

4న ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

కంగ్టి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కంగ్టిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 4న ఇంటర్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రత్యేకాధికారి విజయలక్ష్మి శనివారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ గ్రూపులో 28 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ మెమో, టీసీ, ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఐదు పాస్ ఫొటోలతో హాజరుకావాలన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో..

శివ్వంపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గోమారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 5 స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ నారాయణచౌహాన్ శనివారం తెలిపారు. మెకానికల్ ఇంజనీర్ బ్రాంచ్‌లో 30 సీట్లు, సివిల్ ఇంజనీర్‌లో 20 సీట్లు మొత్తం 50 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9010222186, 9701425530, 9989509350 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

మానవత్వం చాటుకున్న మాజీ ఎంపీపీ

చేగుంట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : చేగుంటకు చెందిన బాసం రాజు ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్ దంపతులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు రూ.లక్ష నగదును మృతుడి భార్యకు అందజేశారు.

రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోండి

అల్లాదుర్గం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలంలోని పలు గ్రామాల్లో ఛిద్రమైన రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు జిన్న భాస్కర్‌రెడ్డి కోరారు. శనివారం బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్ మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు.

వ్యక్తి ఆకస్మిక మృతి

నారాయణఖేడ్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి ఆకస్మికంగా మృతిచెందిన సంఘటన నారాయణఖేడ్ పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద చోటు చేసుకున్నది. అబ్బెంద గ్రామానికి చెందిన ఎర్రోళ్ల లక్ష్మయ్య శనివారం సాయంత్రం ఓ సెటర్ ముందు పడిపోయి.. అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వారు మృతుడి వివరాలు సేకరించారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉన్నది.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి : ఎంపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

వెల్దుర్తి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుపొంది బీజేపీ సత్తా చాటాలని ఎంపీ రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని ఎదులపల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే పలువురు బీజేపీలో చేరగా.. కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రఘునందన్‌రావు మాట్లాడుతూ ప్రజాసేవలో ప్రతీ కార్యకర్త పాలు పంచుకోవాలని, స్థానిక ఎన్నికలపై, గెలిచే నాయకులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. భవిష్యత్‌లో రాష్ట్రం, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో వందశాతం గెలుపు తథ్యమన్నారు. 10 ఏళ్లకాలంలో బీఆర్ఎస్ వెల్దుర్తి నుంచి మెదక్ రోడ్డు నిర్మాణం చేపట్టలేదన్నారు. వెల్దుర్తి నుంచి మెదక్ వరకు డబుల్ రోడ్డు వచ్చేవరకు కొట్లాడుతానని ఎంపీ అన్నారు. అర్హులైన వారికి ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద నిధులు జమ కావడం జరిగిందన్నారు. తన గెలుపునకు కృషి చేసిన పార్టీ కార్యకర్తలను గెలిపించే బాధ్యత తనపై ఉందని ఎంపీ అన్నారు. చేగుంట వద్ద రైల్వే బ్రిడ్జి 100 శాతం కేంద్రం నిధులు మంజూరు అయ్యాయని, త్వరలో భూమి పూజ చేసి ఏడాదిన్నర కాలంలో బ్రిడ్జిని అందుబాటులోకి తెస్తామన్నారు. దుండిగల్ నుంచి మెదక్ వరకు ఫోర్ లైన్, మెదక్‌లో 7 కిలో మీటర్ల బైపాస్ రోడ్డు మంజూరైందని, త్వరలో పనులు ప్రారంభంకానున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు దాసు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం ఎన్ని మెట్లైనా దిగుతా : ఎమ్మెల్యే



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న సునీతారెడ్డి

హత్నూర/శివ్వంపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజల కోసం రాజకీయాలకతీతంగా ఓ మెట్టు దిగి పనిచేసేందుకైనా తాను సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శనివారం హత్నూర రైతువేదికలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. తాను ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేను కావడంతో ఇక్కడ అభివృద్ధి పనులు చేసేందుకు ప్రభుత్వం వివక్ష చూపుతోందని అన్నారు. నియోజకవర్గంలో తాను చేపట్టే ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల విషయాల్లో అధికార పార్టీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, అది సరైన విధానం కాదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, ఎంపీడీవో శంకర్, డిప్యూటీ తహసీల్దార్ దావూద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శివ్వంపేట మండల పరిధిలోని దొంగి గ్రామానికి చెందిన మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు లాయక్ గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అతడిని పరామర్శించారు. ఆమె వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యాదగౌడ్, లక్ష్మీనర్సయ్య, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

జనహిత పాదయాత్ర కాదు.. జనరహిత పాదయాత్ర

● మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతికిరణ్

జోగిపేట రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అందోల్ మండల పరిధిలో నిర్వహించిన జనహిత పాదయాత్ర జనరహిత పాతయాత్రగా మారిందని మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అన్నారు. సంగుపేట శివారులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాదయాత్ర ఎందుకు చేస్తున్నారనే విషయాన్ని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహే‌ష్‌గౌడ్ స్పష్టం చేయలేదని ఆరోపించారు. అసలు పాదయాత్ర ముఖ్య ఉద్దేశం కాంగ్రెస్ కార్యకర్తలకే అర్థం కాలేదన్నారు. మీనాక్షీ నటరాజన్ పాదయాత్ర ఓ కామెడీ షోను తలపించిందన్నారు. పార్టీ బలహీనంగా ఉన్న నియోజకవర్గాల్లో పాదయాత్రలు నిర్వహిస్తున్నారని ఆరోపించిన క్రాంతికిరణ్.. అందోల్‌లో కార్యకర్తలు అసహనంగా ఉన్నారని గుర్తించి, వారిలో జోష్ నింపేందుకు ఇలా పాదయాత్రలు నిర్వహించారన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర పాదయాత్రతో అసలైన పాతయాత్ర ఎలా ఉంటుందో తాము చేసిచూపుతామని క్రాంతికిరణ్ అన్నారు.

పాదయాత్ర చేసి మహేశ్‌గౌడ్‌కు మైండ్ చిప్ దొబ్బింది

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పాదయాత్ర చేసి పీసీసీ అధ్యక్షుడు మహే‌ష్‌కుమార్ గౌడ్‌కు మైండ్ చిప్ దొబ్బిందని, అజ్ఞానంలో రేవంత్ రెడ్డితో పోటీ పడుతున్నాడని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఎద్దేవా చేశారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన అభివృద్ధి ప్రజల ముందు ఉన్నదని, దానికి నిదర్శనమే గత అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి ప్రజలు ఇచ్చిన తీర్పు నిదర్శనమన్నారు. హరీశ్‌రావు నైతిక విలువలతో కూడిన రాజకీయాలు చేస్తారని, ఆయన గురించి నైతిక విలువలు లేనివారు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. బనకచర్ల ప్రాజెక్టు మొదలవ్వక ముందే నిర్మాణం పూర్తయినట్టు బహిరంగంగా మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలు, ఆకాంక్షలను గౌరవించే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని ప్రభాకర్ స్పష్టం చేశారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

● జిల్లా మహిళా శిశు, సంక్షేమ అధికారి హైమావతి



పిల్లల తల్లులతో మాట్లాడుతున్న హైమావతి

అల్లాదుర్గం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అంటువ్యాధులు ప్రబలకుండా అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మహిళా శిశు, సంక్షేమ అధికారి హైమావతి అంగన్‌వాడీ టీచర్లకు, సిబ్బందికి ఆదేశించారు. శనివారం అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని-1ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రం భవనం పైకప్పు పెచ్చులు ఊడిపోతున్నాయని, ఈ భవనాన్ని ఖాళీ చేసి మరో భవనంలో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 7 వరకు తల్లి పాలవారోత్సవాలను నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతను పిల్లల తల్లుకు అవగాహన కల్పించాలన్నారు.

వరినాట్లకు బీహార్ కూలీలు

● ఎకరాకు రూ.5 వేల ఒప్పందం



కులబ్‌గూర్ శివారులో రైతు శ్రీకాంత్ పొలంలో నాట్లు వేస్తున్న బీహార్ రైతు కూలీలు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అన్నదాతలు కూలీల కొరతతో వరినాట్లు వేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటివరకు వర్షాల కోసం ఎదురుచూసిన రైతులు వర్షాలు పడడంతో ప్రస్తుతం కూలీల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. కూలీల కొరతను అధిగమించేందుకు బీహార్, జార్ఖండ్, మహారాష్ట్ర ఇతర రాష్ట్రాల నుంచి కూలీలకు అదనంగా డబ్బులు చెల్లించి నాట్లు వేయిస్తున్నారు. సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామ శివారులో రైతు శ్రీకాంత్ తన వ్యవసాయ పొలంలో నాట్లు వేసేందుకు బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీలు ఎకరాకు రూ.5 వేలు చెల్లిస్తున్నామని తెలిపారు. సంగారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు వేసేందుకు బీహార్ నుంచి 30 మంది వచ్చామని కూలీలు తెలిపారు.

వ్యాక్సినేషన్ పక్కాగా నిర్వహించాలి

● ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల

కొండాపూర్/సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల వ్యాక్సినేషన్ పక్కాగా నిర్వహించాలని సంగారెడ్డి ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల సూచించారు. కొండాపూర్ పీహెచ్‌సీ పరిధిలోని గిర్మాపూర్ సబ్ సెంటర్‌ను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నపిల్లలకు అందిస్తున్న వ్యాక్సినేషన్ వివరాలను ఏఎన్ఎంలకు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల కట్టడికి పక్కాగా జ్వర సర్వే నిర్వహించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన జడ్జి

నర్సాపూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలను శనివారం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హేమలత ఆకస్మికంగా తనిఖీ చేసి.. పాఠశాల అధ్వాన పరిస్థితులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సరిపడా గదులు, మూత్రశాలలు లేకపోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. రెండురోజుల క్రితం ఇద్దరు విద్యార్థులు నీటికోసం కోర్టు సమీపంలోని నల్లవద్దకు వచ్చి కోతులు వెంట పడటంతో వారు కిందపడ్డారు. ఇది గమనించిన జడ్జివెంటనే వేరే బట్టలు తెప్పించి వేసి పంపించారు. పాఠశాల పరిస్థితిపై జిల్లా అధికారులకు నివేదించి, సమస్య పరిష్కరించేలా చూస్తానన్నారు.

కబ్జాల్లో నాలాలు, చెరువులు



పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న నరోత్తం

జహీరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ నియోకవర్గంలో ఎక్కడచూసినా నాలాలు, చెరువులు, వాగులు కబ్జాలకు గురవుతున్నాయని ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నరోత్తం పేర్కొన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాగుల్లో, చెరువుల్లో, నాళాల్లో అడ్డదిడ్డంగా నిర్మాణాలు చేపడుతుంటే అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు నాయకులతో కుమ్మక్కై అనుమతులివ్వడం సరికాదన్నారు. అల్గోల్ చౌరస్తా వద్ద బ్రిడ్జిని ఎందుకు నిర్మించారని, మురుగు, వర్షపు నీరు ఎలా ప్రవహిస్తుందని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి జహీరాబాద్‌లో కబ్జాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వరప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి, శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

కంది, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జీపీ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. శనివారం కంది మండల కేంద్ర గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంది గ్రామం మండల కేంద్ర గ్రామం కావడంతో పని పెరగడం వల్ల గ్రామపంచాయతీ ఆదాయాన్ని బట్టి కార్మికులకు రూ.11,500 జీతం ఉంటే.. ఇప్పుడు రూ.9,500 నెలకు వేతనాలు చెల్లించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లేశం, కోకల వీర్రాజు, సతీష్‌సుదర్శన్, కుమార్, శివరాజ్, పాండు, సురేష్, సత్యమ్మ పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన అవసరం

● సంగారెడ్డి జిల్లా ప్రజా ఆరోగ్య వైద్యసేవల అధికారి మాధవీలత



అన్నారంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న మాధవీలత

గుమ్మడిదల/కల్హేర్/చిన్నశంకరంపేట/టేక్మాల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సంగారెడ్డి జిల్లా ప్రజా ఆరోగ్య వైద్యసేవల అధికారి మాధవీలత పేర్కొన్నారు. గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం పెంచాలని కోరారు. అలాగే వీరన్నగూడెం, వీరభద్రనగర్ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో శ్రీనివాస్, ఏఎన్ఎం వసంత, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కల్హేర్‌లోని కమ్యూనిటీ వైద్యశాల(సీహెచ్‌సీ)లో శనివారం తల్లిపాల వారోత్సవాలను కల్హేర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జేబా షమీమ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సీహెచ్.మాణిక్యం, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని పీహెచ్‌సీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ సాయి సింధు మాట్లాడారు. శిశువు పుట్టిన నుంచి రెండేళ్ల వరకు ముర్రు పాలు పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగరాణి, జ్యోతి పాల్గొన్నారు. టేక్మాల్ మండలంలోని బోడగుట్ట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ అధికారి ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీశైలమ్మ, గీచర్ మంజుల, సునీత పాల్గొన్నారు.

తూప్రాన్ చేరుకున్న ఎస్ఎఫ్ఐ అధ్యయన యాత్ర

తూప్రాన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కళాశాలల సమస్యలు సేకరించేందుకు చేపట్టిన ఎస్ఎఫ్ఐ అధ్యయన యాత్ర శనివారం తూప్రాన్ పట్టణానికి చేరుకుంది. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో తూప్రాన్‌కు చేరుకున్న పాదయాత్రకు ఎస్ఎఫ్ఐ నాయకులు ఘనస్వాగతం పలికారు. తూప్రాన్‌లోని కళాశాలకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. తూప్రాన్‌లో డిగ్రీ, పీజీ కళాశాలలు ఏర్పాటు చేయాలని, కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ యాత్రలో జిల్లా అధ్యక్షుడు నవీన్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● మెదక్ అదనపు కలెక్టర్ నగేష్



23వ వార్డులో పర్యటిస్తున్న అదనపు నగేష్

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 100 రోజుల యాక్షన్‌ప్లాన్ విజయవంతంగా పూర్తి చేయాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు. శనివారం పట్టణంలోని 23, 31వ వార్డులలో కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లిన ఆయన తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని సూచించారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా దోమలను అరికట్టే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో విచ్చలవిడిగా విద్యుత్, ఇతరత్రా వైర్లు ఉండటాన్ని గమనించి ప్రమాదం జరిగే అవకాశాలున్నందున తగు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని చోట్ల పైపులైన్ల నిర్మాణం జరగకపోవడంతో నీటి సమస్యను తీర్చాలని పలువురు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంట ఇంజనీర్లు నితిన్ ఉన్నారు.

గ్రామపంచాయతీల సమస్యలు పరిష్కరించాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి



ధర్నాలో మాట్లాడుతున్న గోదావరిఅంజిరెడ్డి

అమీన్‌పూర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అమీన్‌పూర్ మున్సిపాలిటీల్లోని విలీన గ్రామ పంచాయతీల్లో సమస్యలు తిష్టవేసి, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో పలు కాలనీల సంక్షేమ సంఘాలు శనివారం ఐలాపూర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించాయి. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఆదాయం పెంచుకునేందుకు పన్నులు విధించడంపై చూపెడుతున్న శ్రద్ధ మౌలిక వసతుల కల్పనపై చూపించడం లేదని ఆరోపించారు. హడావుడిగా శివారు గ్రామాలను అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేసిన తరువాత స్థానికుల పరిస్థితి 'పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు' అయ్యిందన్నారు. కాలనీల్లో లింక్ రోడ్లు కొట్టుకుపోయి వాహనాలు నడవలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఈర్లరాజు, మున్సిపల్ అధ్యక్షుడు అనిల్‌చారి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

● ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్ట్ సీడీపీవో హేమభార్గవి

చిలప్‌చెడ్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్లు గృహ సందర్శన నిర్వహించి పిల్లల తల్లిదండ్రులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్ట్ సీడీపీవో హేమభార్గవి తెలిపారు. శనివారం మండలంలోని చండూర్, గౌతాపూర్, చిలప్‌చెడ్ అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల ఎత్తు, బరువులు స్వయంగా పరిశీలించారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులతో సమావేశమై పోషణకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్ సంతోషిమాత పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనలు

జహీరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల పోచమ్మ ఆలయంలో చేపట్టిన బాలమ్మ, పోచమ్మల విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారమూ జరిగింది. మల్లన్నగుట్టకు చెందిన బసవలింగ అవధూతమహరాజ్, ముంగి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరిమహరాజ్ తదితరులు పాల్గొని భక్తులకు ప్రవచనాలు వినిపించారు. 3న దేవతలకు ప్రత్యేక పూజలు, విగ్రహాలకు పుష్పాధివాసం, బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

గంజాయి సాగుచేస్తే కఠిన చర్యలు : ఎస్ఐలు

కంగ్టి/నాగల్‌గిద్ద/మనూరు/కల్హేర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఎవరైనా గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగు చేసినా, ఎండు గంజాయి నిల్వ చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని కంగ్టి ఎస్ఐ దుర్గారెడ్డి హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని దెగుల్‌వాడి గ్రామ శివారులోని పంట పొలాల్లో పర్యటించి పరిశీలన చేశారు. నాగల్‌గిద్ద మండల పరిధిలోని ఇరక్‌పల్లి మేఘ్యనాయక్‌తండా, కూబాతండా శివార్లలో పంట పొలాలను ఎస్ఐ రామక్రిష్ణ పరిశీలించారు. మనూరు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సాగుచేస్తున్న పంటలను ఎస్ఐ కోటేశ్వర్‌రావు పరిశీలించారు. కల్హేర్, నిజాంపేట మండలాల్లోని వివిధ గ్రామాలు, గిరిజనతండాల్లోని పత్తి, కంది పంటలను కల్హేర్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తమ సిబ్బందితో తనిఖీ చేశారు.

కిటకిటలాడిన హనుమాన్ ఆలయాలు

నారాయణఖేడ్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ శనివారాన్ని పురస్కరించుకొని నారాయణఖేడ్ ప్రాంతంలోని హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చరిత్రాత్మకమైన కొండాపూర్ హనుమాన్ ఆలయంలో భక్తులు దర్శనం కోసం బారులుతీరారు. భక్తులకు ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్ ఆశీస్సులతో పాటు దాతల సహకారంతో మహాప్రసాదాన్ని అందజేశారు. కాగా నారాయణఖేడ్ పట్టణంలోని కల్పనా ఆంజనేయ స్వామి ఆలయంలో మహాహారతి భజనలు నిర్వహించారు. సిరూర్ భూమయ్య కాలనీలోని శివపంచాయతిన హనుమాన్ ఆలయంలోనూ శ్రీరామ కథ ప్రవచనం, హారతి కార్యక్రమాలు, మంగల్‌పేట్ హనుమాన్ ఆలయంతోపాటు లొంక హనుమాన్ ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

పరిశ్రమ కాలుష్యంపై అధికారులకు ఫిర్యాదు

జిన్నారం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం పారిశ్రామికవాడలోని ఎంఎస్ఎన్ ల్యాబ్స్ పరిశ్రమ కాలుష్యంపై గడ్డపోతారం మాజీ సర్పంచ్ నీరుడి శ్రీనివాస్, స్థానిక నాయకులు పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి, రామచంద్రాపురం పీసీబీ ఈఈ కుమార్ పాటక్ శనివారం ఫిర్యాదు చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షపు నీటిలో కలిపి పరిశ్రమ ఔట్ లేట్స్ నుంచి భారీగా రసాయన జలాలు వదిలివేయడంతో బహిరంగ ప్రాంతాలు, కిష్టాయ్యపల్లి చెరువులోకి చేరి వ్యవసాయ రంగానికి నష్టం జరుగుతుందని తెలిపారు. వెంటనే పరిశ్రమపై చర్యలు తీసుకొని వ్యర్థ జలాల ప్రవాహాన్ని నిరోధించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా, పలువురికి గాయాలు

వెల్దుర్తి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అదుపు తప్పి ఆటో బోల్తాపడిన ఘటనలో పలువురు గాయపడ్డారు. ఈ సంఘటన వెల్దుర్తి గ్రామ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వెల్దుర్తి మండలం మేల్లారు గ్రామానికి చెందిన పిట్ల నర్సమ్మ, పిట్ల వసంత, పిట్ల రాణి తన 11 సంవత్సరాల కూతురు శ్రీవాణి వెల్దుర్తిలో నిర్వహించిన సంతలో కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి నాగులపల్లికి చెందిన ఆటో డ్రైవర్ యాదగిరి ఆటోలో బయల్దేరారు. ఇదే ఆటోలో యాదగిరి స్నేహితుడు మహేష్, అలాగే రాజ్‌పల్లి గ్రామానికి చెందిన సున్నం దుర్గయ్య దంపతులు కూడా ఉన్నారు. అయితే వెల్దుర్తి గ్రామ శివారుకు రాగానే ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఏడుగురికి స్వల్ప, నాగమణి అనే మహిళకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో తూప్రాన్ ఆస్పత్రికి తరలించారు. నాగమణి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం.